ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 07.11.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. స్వాతంత్రోద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్పూర్తి నింపిన వందేమాతరం గేయం 150 ఏళ్ల ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.

2. వందేమాతరం ఏ మతానికి సంబంధించినది కాదని , దేశం నుంచి ఆంగ్లేయులను తరిమికొట్టిన స్పూర్తి గీతమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

3. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రెండో విడత విచారణ నిర్వహిస్తున్నారు.

4. తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలియజేశారు.

**వందేమాతరం**

స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్పూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి ఈరోజుతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాలను ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ ఉదయం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. సామూహిక గేయాలాపనలో ప్రధానమంత్రి కూడా పాల్గొని పాడారు. అనంతరం స్మారక స్టాంపును, నాణేన్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేశారు.

అలాగే, రాష్ట్రమంతా ఈ ఉదయం వందేమాతర గేయాన్ని ఆలపించింది. అన్ని జిల్లాల కలెక్టరేట్లు, అన్ని విద్యామందిరాల్లో సామూహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయోద్యమ మహనీయులకు ఘన నివాళులర్పించారు. వందేమాతరం.. జాతీయ గీతం స్ఫూర్తిగా , సమైక్యతా భావంతో దేశ అభివృద్ధికి పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

డెస్క్

కిషన్ రెడ్డి

భారత జాతీయ గేయం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి అయిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, హైదరాబాద్, సుల్తాన్ బజార్ వద్ద ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ , పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ , తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రామ్ చందర్ రావు , తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా , ఢిల్లీ నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ప్రత్యేక తెరపై వీక్షించారు.

అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... వందేమాతరం ఏ మతానికీ సంబంధించింది కాదని, ఇది ఆంగ్లేయులను దేశం నుండి తరిమికొట్టిన స్ఫూర్తి గీతమని స్పష్టం చేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన 'వందేమాతరం' రామ్ చందర్ రావు సేవలను , అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని స్మరించుకున్నారు. విద్యాసంస్థలు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

బైట్ ... కిషన్ రెడ్డి

ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ... బానిస సంకెళ్ల నుండి విముక్తికి స్ఫూర్తినిచ్చిన ఈ గేయాన్ని , ఆనాడు కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని విమర్శించారు.

పిటిసి, హైదరాబాద్

**పొన్నం**

స్వాతంత్ర్య ఉద్యమంలో అందరిని ప్రేరేపించిన వందేమాతరం గేయం ఇప్పుడు మరోసారి సామూహిక ఆలాపన ద్వారా మన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు ఉపయోగపడుతుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ , అబిడ్స్ లోని మహబూబియా గర్ల్ హై స్కూల్ లో బంకించంద్ర ఛటర్జీ రాసిన 150 సంవత్సరాల వందేమాతరం వేడుకల్లో మంత్రులు పాల్గొని మాట్లాడారు.

ప్రెస్ నోట్

**AIR**

'వందే మాతరం' రచించి 150 ఏళ్ళయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన సామూహిక ఆలాపనలో భాగంగా జాతీయ గేయాన్ని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఉన్నతాధికారులు , సిబ్బంది ఆలపించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ , DDG-E హరిసింగ్, ప్రోగ్రామ్ హెడ్ సుంకసారి రమేష్ తో పాటు ప్రాంతీయ వార్తా విభాగం అధికారులు , సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

MSL

**వందేమాతరం - జిల్లాలు**

జాతీయ గేయం వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ వేడకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కలెక్టరేట్లు సహా , విద్యా సంస్థల్లో ఈ ఉత్సవాలను అధికారికంగా జరుపుకుంటున్నారు. ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో పోలీసులు సామూహికంగా ఈ గేయాన్ని ఆలపించారు.

మంచిర్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో, పలు కూడళ్లలో వందేమాతరం సామూహిక గేయాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వందేమాతరం ప్రజలకు ఒక అస్త్రమై బ్రిటిష్ పాలనను ఎదిరించిందని , రాజన్న సిరిసిల్ల జిల్లా , వేములవాడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యుడు లక్ష్మి నారాయణ అన్నారు.

బైట్ ... లక్ష్మి నారాయణ

జగిత్యాల జిల్లా లోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు పాఠశాలల్లో , పలు కూడళ్లలో వందేమాతరం సామూహిక గేయా ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నల్గొండ జిల్లా లో జరిగిన ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

వందేమాతరం మనందరి ఐక్యతకు, దేశభక్తికి ప్రతీక అని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు. జిల్లాలో జరిగిన ఉత్సవంలో ఆమె పాల్గొన్నారు.

స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మందిలో స్ఫూర్తి నింపిన గేయం వందేమాతరమని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో సామూహిక వందేమాతరం గీతాలపన కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ గుర్తింపు భావన , ఆంగ్లేయుల పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న కాలంలో వందేమాతరం గేయం, దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారిందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.

జనగామ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

యావత్ భారత జాతిని ఏకం చేసి, భారతీయులందరిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన గేయం "వందేమాతరం" అని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు.

(పిటిసి, ఖమ్మం, మంచిర్యాల, జగిత్యాల, నల్గొండ, వరంగల్, సంగారెడ్డి, మహబూబాబాద్, జనగామ, నాగర్ కర్నూల్, పెద్దపల్లి)

**HYD**

తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరుగుతోంది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అసెంబ్లీలోని ఆయన కార్యాలయంలో రెండో విడత విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే తొలి విడత విచారణ ముగియగా , రెండో విడతలో భాగంగా నిన్న ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్‌లు స్పీకర్ ముందు హాజరయ్యారు. ఈరోజు పోచారం శ్రీనివాస్‌రెడ్డి , అరికెపూడి గాంధీ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ చేపడుతున్నారు.. వీరి వాదనలు విన్న అనంతరం , ఈనెల 12వ తేదీన తెల్లం వెంకట్రావు , సంజయ్‌లను మరోసారి విచారించనున్నారు. అలాగే, 13వ తేదీన పోచారం , అరికెపూడి గాంధీలను స్పీకర్ రెండోసారి విచారించనున్నారు.

పిటిసి, హైదరాబాద్

**కూరగాయలు**

రాష్ట్రంలో కూరగాయల కొరతను అధిగమించేందుకు వాటి సాగును భారీ ఎత్తున ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 10 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు వీలుగా రైతులకు సబ్సిడీ అందించేందుకు సంకల్పించింది. ఒక్కో ఎకరంలో ఆరు టన్నుల కూరగాయల ఉత్పత్తి ఖర్చును అంచనా వేసి అందులో 40 శాతం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. దీనికి సంబంధించిన కార్యాచరణ చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. టమాటా, వంకాయ, బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్, మిర్చి, బీర, క్యాప్సికం, చిక్కుడు, కాకర, దొండ,

నొరకాయ, తదితర తోటల సాగుకు ముందుకొచ్చే రైతులు స్థానిక ఉద్యాన అధికారికి దరఖాస్తు చేసుకుంటే ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేస్తారు.

డెస్క్

స్టిమ్యులేటర్

రంగారెడ్డి జిల్లా,  చేవెళ్ల రోడ్డు ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బస్సు ప్రమాదంలో ప్రయాణీకులు మరణించడానికి వేరే వాహనం డ్రైవర్ కారణమైనప్పటికీ.. ఆర్టీసీ డ్రైవర్లకు మరింత నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇతర వాహన డ్రైవర్ల తప్పిదాలతో జరిగే ప్రమాదాల నుంచి ప్రయాణికుల్ని రక్షించే విషయంలో డ్రైవర్ల సామర్థ్యాన్ని పరీక్షించడంతోపాటు వారిలో డ్రైవింగ్ నైపుణ్యాలు పెంపొందించేందుకు శాస్త్రీయ శిక్షణ ఇవ్వాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందు కోసం రెండు అత్యాధునిక సిమ్యులేటర్లను కొనుగోలు చేయాలని సంస్థ ఎండీ నాగిరెడ్డి అధికారుల్ని ఆదేశించారు.

డెస్క్

**షార్ట్ ఫిలిం**

తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలియజేశారు. వచ్చేనెల 19 నుండి 21వ తేదీ వరకు దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీ సంస్థ ద్వారా దీనిని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా  30లక్షల రూపాయల బడ్జెట్ విడుదలకు మంత్రి ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

పీఎస్

**గిగ్**

రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు సంక్షేమం , రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పించేందుకు త్వరలో ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

సచివాలయంలో నిన్న అగ్రిగేటర్లు , గిగ్ వర్కర్లు , కార్మిక సంఘాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం రూపొందించిన బిల్లును ఈనెల 12న మంత్రిమండలి సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత శాసనసభలో ప్రవేశపెడతామన్నారు. సభ్యుల ఆమోదం పొందాక.. చట్టం తీసుకువచ్చి గిగ్ వర్కర్లను ఆదుకుంటామని మంత్రి చెప్పారు.

డెస్క్

హోం ఓటింగ్

జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక నేపధ్యంలో ఆ నియోజక వర్గ ఓటర్లు ఇంటి వద్ద ఓటు కార్యక్రమంలో 100 శాతం పోలింగ్ నమోదైంది. కేంద్ర ఎన్నికల సంఘం వృద్ధులు , దివ్యాంగులకు బ్యాలెట్ పద్ధతిలో ఇంట్లోనే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 103 మందికి అవకాశం లభించగా.. ఎన్నికల అధికారులు ప్రక్రియను పూర్తిచేశారు. ఈనెల 4న 97 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. నిన్న మిగిలిన ఆరుగురు కూడా ఓటు వేశారు. బ్యాలెట్ బాక్సులను యూసుఫ్ గూడలోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచినట్లు జిల్లా ఎన్నకల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు.

డెస్క్

**గుర్తింపు కార్డులు**

జూబ్లీహిల్స్ శాసనసభ ఉపఎన్నికలో ఈనెల 11 న జరిగే పోలింగులో ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫోటో గుర్తింపు కార్డు తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఓటరు ఫోటో ఐడీ కార్డు లేనివారు భారత్ ఎన్నికల సంఘం గుర్తించిన 12 ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని చూపించవచ్చని చెప్పారు.

ఎంఎస్ఎల్

వాతావరణం

ఈరోజు రాష్ట్రంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాత్రివేళ పొగమంచు , మబ్బులు కమ్ముకునే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది

పీఎస్

మీట్

క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మహిళా జట్టు క్రికెట్ ప్లేయర్ అరుంధతి రెడ్డి ఈరోజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మహిళా ప్రపంచ కప్ క్రికెట్ జట్టులో అరుంధతి రెడ్డి తనదైన పాత్ర పోషించారు. ఈ సందర్భంగా అరుంధతి రెడ్డిని క్రీడా శాఖ మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ , ఎండీ సోని బాల దేవి , కోచ్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

**క్యాన్సర్**

ఈరోజు దేశవ్యాప్తంగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పాటిస్తున్నారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు , చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం. 2014లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ రోజును ప్రారంభించింది. పొగాకు , మద్యం వంటి వ్యసనాలను నివారించడం , ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి జీవనశైలి మార్పుల ప్రాముఖ్యతను ఈరోజు వివరిస్తారు.

డెస్క్